క్లుప్తంగా

45 మందికి వైద్య సేవలు



ఎర్రంపాడు సబ్ సెంటర్‌లో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సుష్మ

రాజవొమ్మంగి: మండలంలోని ఎర్రంపాడులో రాజవొమ్మంగి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ శిబిరానికి వచ్చిన 45 మందికి వైద్య సేవలందించినట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలు ప్రత్యేక పరీక్షలు చేశామని, సుగర్, బీపీ సమస్యలు ఉన్నవారికి మందులు అందజేసినట్టు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులను పలు ఆరోగ్యసూత్రాలు తెలియజేశారు. హెల్త్ అసిస్టెంట్ నాని, ఏఎన్‌ఎంలు కృష్ణ, సుజాత, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అంబులెన్సులను పరిశీలించిన అధికారులు



రాజవొమ్మంగిలో 104, 108 వాహనాలను పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని 104, 108 అంబులెన్స్ వాహనాల నిర్వహణ, వాటి కండిషన్లను సంబంధిత అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రాజవొమ్మంగి వచ్చిన ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి, డీసీ డాక్టర్ డేవిడ్ తాళ్లూరి డివిజినల్ మేనేజర్ మునగ సతీష్‌కుమార్ రికార్డులు పరిశీలించారు. వాహనాల కండిషన్లు ఇతరత్రా వివరాలను పైలెట్లను అడిగి తెలుసుకొన్నారు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొన్నారు. ఇదే తరహాలో అడ్డతీగలలో కూడా అంబులెన్స్‌లను అధికారులు పరిశీలించారు.

బైకు చోరీపై ఫిర్యాదు



చోరీకి గురైన పల్సర్ బైకు ఇదే

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి చెందిన కోడా నాగేశ్వరరావు తన పల్సర్ బైక్ చోరీకి గురి కావడంతో బుధవారం ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 3వ తేదిన సుజనపేటలో జరిగిన ముత్యాలమ్మ జాతరలో పార్కింగ్ చేసిన బైకు కనిపించలేదని, అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో బైకు చోరీకి గురైనట్టు భావించి పోలీసులకు ఫిర్యారు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎపి39 ఈపి 3203 నంబర్ గల బైకు ఎక్కడ కనిపించినా 8247342128 నంబర్‌కు సమాచారం అందజేయగలరని బాధితుడు నాగేశ్వరరావు కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

కోటవురట్ల: గ్రామీణ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ సర్కారు బడులకు కీర్తిని తీసుకొస్తున్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో సత్తా చాటిన పలువురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దుబాసి యశస్విని, మళ్ల చర్మిళ, సూరిశెట్టి రష్మిత, తీడ వెంకట రాజ్‌కుమార్, ఎత్తుల శివదుర్గ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దాంతో ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. మిగతా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు పట్టుదలగా కృషి చేయాలన్నారు.

కూరగాయల సాగు...లాభాలు బాగు

- వనభసింగిలో ఎక్కువ విస్తీర్ణంలో పంట
- విత్తు నుంచి విక్రయం వరకు శ్రమే
- వారపు సంతల్లో అమ్మకాలు
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు



వనభసింగిలో కూరగాయల సాగు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలం వనభసింగి పంచాయితీ కేంద్రంలో గిరిజన రైతులు విస్తారంగా కూరగాయల సాగును చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా పంటలు వేస్తూ ఏడాది పోడువునా కూరగాయల సాగుతోనే కుటుంబ జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా వారపు సంతల్లో కూరగాయల అమ్మకాల ద్వారానే ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారు. గ్రామంలో 64 కుటుంబాలు కూరగాయల సాగునే నమ్ముకునే ఉండడం విశేషం. ప్రస్తుతం వనభసింగి గిరిజన రైతులు అన్ని రకాల కూరగాయల సాగు చేస్తూ ఇంటిలపాది జీవనం సాగిస్తున్నారు.

200 ఎకరాల్లో పండించే పంటలు

వనభసింగి గ్రామంలో 146 మంది గిరిజన రైతులు 200 ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. క్యాబేజీను-20ఎకరాల్లో, క్యారేట్‌ను-20, టమాటా-15, పచ్చిమిర్చి-10, బంగాళదుంపలు-25, చిక్కుడు-10, బీర-15, వంకాయ-20, క్లాలీపవర్- 20, తియదుంపలు-10 ఎకరాల్లో, బీర-15 ఎకరాల్లో ,బెండ -18 ఎకరాల్లో పాటు ఆకుకూరలను 61 ఎకరాల్లో పండిస్తున్నారు. ప్రతిరోజు 120 కిలోలకుపైగా అన్ని కూరగాయల దిగుబడి వస్తుంది. పండించిన కూరగాయలను ముంచంగిపుట్టు, పెదబయలు, అరకు, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాలలో జరిగే వారపు సంతలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ, పాడువా గ్రామాల్లో జరిగే సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. దీనికి తోడు సుమరు 58 ఆశ్రమ పాఠశాలలకు సైతం అవసరమైన కూరగాయలను సరఫరా చేస్తున్నారు.



పెదబయలు వారపు సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన టమాటా

టమాటాకు గిరాకీ

పెదబయలు: మండల కేంద్రంలోని ప్రతి వారం నిర్వహిస్తున్న సంతలో టమాటాకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. మండలంలోని పలు ప్రాంతాలతో పాటు ముంచంగిపుట్టు, ఒడిశా నుంచి గిరిజన రైతులు టమాటా తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించే టమాటాకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం 25 కిలోల బుట్ట టమాటా రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. గత నెలలో రూ.600 నుంచి రూ.800లకు పైగా అమ్ముడైనట్టు రైతులు చెబుతున్నారు. కిలో టమాటా రూ.30లకు విక్రయిస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి వారపు సంతల్లో కొనుగోలు చేస్తున్నట్టు గిరిజన రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పెదబయలు వారపు సంతకు ఒడిశా జగదల్‌పుర్ నుంచి ఎక్కువగా కూరగాయలు తెచ్చి అమ్మకం చేస్తున్నారు. అయితే ఇటీవల వాతావరణం అనుకూలించడంతో దిగుబడి బాగుందని రానున్న రోజుల్లో మరింత ధర రావచ్చని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల అభిమానం, సమష్టి కృషితోనే వైఎస్సార్‌సీపీ గెలుపు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

చింతపల్లిరూరల్: గిరిజనుల అభిమానం, సమష్టి కృషితోనే వైఎస్సార్‌సీపీ గెలుపు సాధ్యమైందని పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. వారు బుధవారం మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజన జాతి పూర్తిగా మద్దతు ఇచ్చిందన్నారు. మన గిరిజన గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అంతటి మెజార్టీ రాడానికి కారణం ప్రజాప్రతినిధులు, కార్యకర్తల, అభిమానులు కష్ట ఫలమే అని అన్నారు. రాష్ట్రంలో జరిగిన పరిణామాలను నిశితంగా పరిశీలించి రానున్న ఐదు సంవత్సరాల కాలంలో లోపాలను సరిదిద్దుకోని మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చేలా కష్టపడతామని పిలుపునిచ్చారు. విజయం సాధించిన అరకు పార్లమెంట్ అభ్యర్థి తనూజారాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగంనకు వారు శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనంద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జల్లి హలియరాణి, మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నర్సీపట్నం : మున్సిపాలిటీ సీబీఎం కాంపౌండు సమీపంలో రోడ్డు పక్కన చిరువ్యాపారులపై కారు దూసుకెళ్లిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం నుండి చింతపల్లి వైపు వెళుతున్న కారు అతివేగంగా వెళుతూ సీబీఎం కాంపౌండు సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో స్థానిక అయ్యన్న కాలనీకి చెందిన కొమ్మనాపల్లి రమణ (42) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు రమణ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమణ మృతితో కుటుంబం రోడ్డున పడింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వ్యక్తి, ఇద్దరు మహిళలు మోటారు సైకిల్‌పై పరారైనట్టు మృతుని భార్య లక్ష్మి చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని ఆరా తీసారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, కారు ఓనర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ..యువకుడి మృతి

కశింకోట : మండలంలోని బయ్యవరం వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ ఎం.వినోద్ బాబు అందించిన వివరాల ప్రకారం...యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ బయ్యవరం వద్ద అదే మార్గంలో వెళుతున్న బైక్‌ను వెనుకగా ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న కె.కోటపాడు మండలం గొంపవానిపాలెం గ్రామానికి చెందిన గొంప ముత్యాలనాయుడు (36), స్నేహితుడు శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముత్యాలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని, క్షతగాత్రుడు శంకర్‌ను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు ముత్యాలనాయుడుకు భార్య లక్ష్మి, కుమారుడు తనీష్ ఉన్నారు.

కోళ్ల గదిలో నాగుపాము

- తల్లి కోడిని చంపి పిల్లల్ని మింగిన నాగుపాము



కోడిని చంపి పడగవిప్పి ఉన్న నాగుపాము



పాము హతమార్చిన గ్రామస్తుడు వెంకటరావు

పెదబయలు: కోళ్ల గదిలో నాగు పాము ప్రవేశించి తల్లి కోడి పాము నుంచి పిల్లల్ని కాపాడే ప్రయత్నంలో తల్లికోడి ప్రాణాలు విడిచింది. తరువాత కోడి పిల్లల్ని నాగు పాము మింగేసింది. మండలంలోని గుల్లేలు పంచాయతీ రెంజెలమామిడి గ్రామానికి చెందిన బొండా వెంకటరావు ఇంటికి ఆనుకుని నాటు కోళ్ల గదిలో బుధవారం ఉదయం నాగు పాము ప్రవేశించింది. కోడి పిల్లల్ని చంపాలని ప్రయత్నంచింది. తల్లికోడి అడ్డుకునే ప్రయత్నంలో పాము కాటుతో తల్లి కోడి మృతి చెందగా, అక్కడే ఉన్న రెండు కోడి పిల్లలను పాము మింగేసింది. కోళ్ల శబ్దాన్ని గమనించి బయటకు వచ్చిన ఇంటి యజమాని వెంకటరావు అక్కడ కోడి మృతి చెంది ఉండడాన్ని గమనించాడు. అదే గదిలో పాము కనిపించడంతో కర్రతో కొట్టి నాగుపామును చంపాడు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



పెదబయలు పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు,అటవీ శాఖ సిబ్బంది



దారెలలో మొక్క నాటుతున్న వైద్యాధికారి శిరీష

పెదబయలు: పర్యావరణ పరిరక్షణ అందని బాధ్యత అని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక జీసీసీ మేనేజర్ ఓలేసి గాసి, స్థానిక ఎస్ఐ పులి మనోజ్‌కుమార్, పెదబయలు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖీల్ అన్నారు. పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో పలు రకాల 50 మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ప్రతీ కార్యాలయంలో, ఇంటి పెరట్లో ఇతర ప్రదేశాల్లో మొక్కలు నాటాలని అడవుల పెంపకానికి అధిక ప్రాధ్యాతన నివ్వాలని కోరారు. ప్రతీ జీవికి చెట్ల ప్రాణధారమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. పెదబయలు రేంజ్ అటవీ పరిధి అధికారి కె.వి.రాజేశ్వరరావు, అటవీ విస్తరణ అధికారి ఎస్.సుజాత.అటవీ శాఖ బీట్ అధికారులు కె.నీలకంఠం, జి.అనూష సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు మానవాళి మనుగడకు జీవనాధారం

ముంచంగిపుట్టు: మొక్కలు మానవాళి మనుగడకు జీవనాధారమని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు.మండలంలో గల దారెల పంచాయతీ కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ మొక్కలు నాటి చెట్టుగా మారింతే మానవులకు ఎంతో ఉపయోగమన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గిరిష్‌దొర, ఎంఎల్‌హెచ్‌పి తులసి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం బుధవారం స్థానిక అటవీ శాఖ అధికారల ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర స్థానిక పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సరోజ్ ముఖర్జీ, ఎఫ్ఎస్ఓ బాలాజి, ఎఫ్‌బీఓలు. సూర్యప్రసాద్, రామకృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని లోతట్టు ప్రాంతం వాతంగి పంచాయతీ, ఓకుర్తి గ్రామంలో స్థానిక విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్ బుధవారం స్థానిక గిరిజన మహిళలచే పెరటిలో పెంచే కూరగాయల విత్తనాలను నాటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించామని ట్రస్ట్ టీం సభ్యులు వాసు, ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి తెలిపారు. విద్యార్థులతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసామన్నారు. గ్రామస్తులచే మొక్కలు నాటించడంతో పాటు పెరటి మొక్కల ఆవశ్యకతను వివరించామన్నారు.



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో మొకలు నాటుతున్న రేంజ్ అధికారి అబ్బాయిదొర, అటవీ అధికారులు



ఓకుర్తిలో కూరగాయల విత్తనాలు జల్లుతున్న గిరిజన మహిళలు



ఓకుర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సినియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో అసోసియేషన్ సీనియర్ ప్రతినిధి కేవీ గౌరీపతి ఆధ్వర్యంలో విజయనగరం శ్రీ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల వృద్ధులకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు షుగర్ పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు వైద్యుల సూచనల మేరకు సకాలంలో మందులు వాడాలని సూచించారు. 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి విల్లూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంబీవీ స్వామి, సహాయ కార్యదర్శి మహేశ్వరరావు, సీనియర్ సభ్యులు కేఎం నాయుడు, కె.వీరభద్రరావు, తమ్మిరాజు, కె.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నియంత్రణ

అనకాపల్లి: వర్షాకాలంలో దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణిజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో మలేరియాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దోమల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి ముందున్న కాలువలో చెత్తచెదారం వేయకూడదని, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. గంబూజియా, గప్పి అనే చిన్నచిన్న చేపల్ని నీటి స్థావరా(బావులు, కుంటలు)ల్లో వదిలితే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఇంటిపై ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలని, లేకుంటే దోమలు గుడ్లుపెట్టి, రోగాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడాలని సూచించారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో, వీధుల్లో ఫాగింగ్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.మంగమ్మ, బి.సంఘం తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మలేరియా వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలపాలెంలో బుధవారం మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మలేరియాకు కారణమైన దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. వారానికి ఒక సారి నిల్వ నీటిని తొలగించి డ్రైడే పాటించాలన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే రుబ్బు రోళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు లవకుమార్

అనకాపల్లి : జాతీయ స్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకూ రాజస్థాన్ రాష్ట్రం గంగానగర్‌లో జరుగుతాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.బద్రీనాథ్ బుధవారం అన్నారు. ఈ పోటీలకు ఏపీ నుంచి జిల్లా క్రీడాకారుడు కె.లవకుమార్ 74 కేజీల విభాగంలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన చెప్పారు. మే 29, 30, 31 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన చెప్పారు.

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సేవలు..తప్పని అవస్థలు



చోటముఖిపుట్టు వద్ద ఆరుబయట పడి ఉన్న బీఎస్ఎన్ఎల్ వైర్లు

ముంచంగిపుట్టు: మండలంలో బీఎస్ఎన్ఎల్ సమాచార వ్యవస్థ గత కొద్ది రోజులుగా స్తంభించింది.దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరుచూ బీఎస్ఎన్ఎల్ సమాచార వ్యవస్థ పని చేయకపోవడంతో తమ డబ్బులు వృథా తప్ప వినియోగం లేకుండా పోతున్నాయని చెబుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్థానికంగా ఎవరు అందుబాటులో లేకపోవడం, కార్యాలయానికి తరచూ తాళాలు వేసి ఉండడంతో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మీద ఆధారపడి పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లలో కొన్ని రోజులుగా అత్యవసర పనులు నిచిపోయినట్టు చెబుతున్నారు.. ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో బీఎస్ఎన్ఎల్ కేబుల్ వేర్లు సైతం పలుచోట్ల బయటకు కనిపిస్తూ ఉండడంతో తరచూ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు తెంచేస్తూ ఉండడంతో తరచూ సిగ్నల్స్‌లో అవరోధాలు ఎదుర్కొంటున్నట్టు పలువురు చెబుతున్నారు. బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు స్పందించి సమాచార వ్యవస్థను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.